హుజూర్‌నగర్, అక్టోబరు 6: ఉమ్మడి నల్లగొండ జిల్లా తొలి జడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన గోపు శౌరెడ్డి (జీఎస్‌రెడ్డి) నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. మిర్యాలగూడ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన ఆయన కేంద్ర ప్రభుత్వం నుంచి శౌర్య అవార్డు అందుకున్నారు. 1917లో గోపు శౌరెడ్డి జన్మించారు. 1960లో నల్లగొండ తొలి జెడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1952లో కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపు శౌరెడ్డి హైకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. గోపు రాయపురెడ్డి, ఇన్నాశమ్మల కుమారుడైన జీఎస్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. అంతకుముందు కాంగ్రెస్ సభ్యుడిగా పనిచేసిన ఆయన ఇందిరాగాంధీ కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్నారు. 1965లో మిర్యాలగూడ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మూడుసార్లు ఎంపీగా గెలిచారు. మొదటి నుంచి క్యాథలిక్ సొసైటీకి జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన కాలంలో జీఎస్‌రెడ్డి మదర్‌థెరిసాను నల్లగొండకు తీసుకొచ్చి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలోనే మఠంపల్లి గ్రామపంచాయతీ 1961లో సర్పంచ్‌తో సహావార్డు సభ్యులందరినీ మహిళలను బరిలో నిలిపి గెలిపించేలా చేశారు. జెడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన తొలి నాళ్లలోనే ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ రహదారులు, చిన్ననీటి పరిశ్రమలు ఏర్పాటు చేశారు. గ్రామీణ విద్యకు ఆనాడే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ భూములను పేదలకు పట్టాలు పంచి పెట్టారు. 1986 అక్టోబరు 7వ తేదీన సూర్యాపేట వద్ద జరిగిన కారు ప్రమాదంలో జీఎస్ రెడ్డి మృతిచెందారు. ఆ ప్రమాదంలో ఆయనతో పాటు ఆయన పెద్ద కుమారుడు రాయపురెడ్డి, మనవడు అభినయరెడ్డి మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు, చిన్నకుమారుడు బాలిరెడ్డి ఉన్నారు. రెండో కుమారుడు రాజారెడ్డి, మూడో కుమారుడు ప్రతాపరెడ్డి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం





పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, అక్టోబరు 6: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దసరా సెలవులు, వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. ధర్మ దర్శనానికి గంటపాటు, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సాయంత్రం గంటపాటు కురిసిన వర్షానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయ ప్రాకార మండపాల బయట, తూర్పు రాజగోపురం, ఉత్తర దిశలో షెడ్డు కింద తలదాచుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.32,50,448ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు నిర్వహించారు. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

లలితాదేవి అలంకరణలో దుర్గామాత

లక్ష్మీనరసింహ స్వామివారి అనుబంధ ఆలయం శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారి శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. నాలుగో రోజు ఆదివారం అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణలు, గాయత్రి జపాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు.

జాతీయస్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 6: నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన ధరావత్ సురేష్ నాయక్ జాతీయ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జూలై 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. జట్టు ఫైనల్‌కు చేరేందుకు ప్రతిభ కనబర్చాడు. వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యప్రదేశ్‌లోని 8వ జాతీయస్థాయి పోటీలు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు గ్వాలియర్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర జట్టు కోచ్ సోహెల్‌ఖాన్ పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేసి పోటీలకు వెళ్లనున్నాడు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

నార్కట్‌పల్లి, అక్టోబరు 6: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నాగరాజు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెదుర్తి మండలం ద్రోణం రాజునగర్‌కు చెందిన సాగి దిలీప్‌వర్మ అనే యువకుడు నార్కట్‌పల్లి శివారులోని విద్యార్థులతో పాటు మరికొందరికి గంజాయి విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వర్మను అదుపులోకి తీసుకుని విచారించారు. హైదరాబాద్ నుంచి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లలో తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. తనిఖీల్లో భాగంగా నిందితుడి నుంచి రూ.16వేల విలువైన 650 గ్రాముల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన ఎస్‌ఐ క్రాంతికుమార్, కానిస్టేబుళ్లు రాము, గిరిబాబు, తిరుమల్, శివ శంకర్, శ్రీనివాస్‌ను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

మునుగోడును మునిసిపాలిటీగా మారుస్తాం



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, అక్టోబరు 6: మునుగోడు మేజర్ గ్రామపంచాయతీని మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం, వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డు, పోలీస్‌స్టేషన్ భవనాలతో పాటు కూరగాయలు, పశువుల సంతలను పరిశీలించారు. ప్రభుత్వం సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందులో కూరగాయలు, మాంసం దుకాణాలు సైతం సమీకృత మార్కెట్ సౌకర్యం ఒకే చోట ఉంచుతూ భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్మాణాలు జరగాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవిముదిరాజ్, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, పాల్వాయి జితేందర్‌రెడ్డి, మిర్యాల వెంకన్న, సైదులు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

'మహాలక్ష్మి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్టాండుకు వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకుంటుండగా చౌటుప్పల్ నుంచి నల్లగొండకు వెళ్లే బస్సు వచ్చింది. ఆ బస్సును ఎక్కిన ఎమ్మెల్యే ప్రయాణికులతో ముచ్చటించారు. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని ఆరా తీశారు. 'బస్సులో ఉచిత ప్రయాణం చేసే వాళ్లం ఆధార్ కార్డు చూపి దర్జాగా కూర్చుంటున్నాం.. డబ్బులు పెట్టి టికెట్ తీసుకున్న వాళ్లకు మాత్రం సీట్లు దొరకడం లేదని' ఓ మహిళ చెప్పిన మాటలకు బస్సులోని ప్రయాణికులందరూ ఒక్కసారిగా నవ్వారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజుయాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

గోదారమ్మ పరవళ్లు..

తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు మత్తడి దూకుతుండటంతో గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల ప్రజలు ఆనందంలో మునిగితేలుపోతున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరిక మేరకు మంత్రులు ఆదేశాలతో ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీళ్లను అధికారులు విడుదల చేశారు. దీంతో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లకున్నా...అలుగుపోస్తున్న చెరువును తిలకించి ప్రజలు రైతులు పులకించిపోతున్నారు. గంధమల్ల చెరువు పక్కన పచ్చదనం పర్చుకున్న కొండలు పచ్చని అందాలు కనువిందు చేస్తున్నాయి.

-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్-యాదాద్రి

పచ్చని పొలాల మధ్య గంధమల్ల రిజర్వాయర్





గంధమల్ల చెరువు మత్తడిదూకుతున్న దృశ్యం

ఆందోల్ మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 6: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారులోని ఆందోల్ మైసమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆందోల్ మైసమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను ప్రాతినిథ్యం వహించే భువనగిరి పార్లమెంట్ పరిధిలో ప్రముఖ దేవాలయంగా విరాజిల్లుతున్న ఆందోల్ మైసమ్మ ఆలయానికి ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేకంగా నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబుతో పాటు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: సీపీఎం

భువనగిరి రూరల్, అక్టోబరు 6: మండల వ్యాప్తంగా నెలకొన్న స్థానిక సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి మండలం బస్వాపురంలో జరిగిన 10వ మహాసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని బస్వాపురం నుంచి గంగసానిపల్లి - హన్మాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బస్వాపురంలో సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పేదలకు కేటాయించిన ప్లాట్లలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. సమావేశంలో నాయకులు అన్నంపట్ల కృష్ణ, ఉడుత విష్ణు, ఎదునూరి మల్లేశం, సత్యనారాయణ, బాలనర్సింహ, చంద్రయ్య, వెంకటేశ్, బాస్కర్, దశరథ పాల్గొన్నారు.

'అంబుజా' అనుమతిని రద్దు చేయాలి

రామన్నపేట, అక్టోబరు 6: రామన్నపేట మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని తెలంగాణ ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. అదాని వారి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాననడం సరికాదని, వీలుంటే డ్రైఫ్రూట్, లాజిస్టిక్ పార్కు, గోదాములు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ నెల 23వ తేదీన ప్రజా సేకరణ కార్యక్రమాన్ని వ్యతిరేకించాలని కోరారు. దాసరి బుచ్చిరెడ్డి, నోముల శేఖర్, ఒంటెద్దు రమేష్, మారయ్య, చెన్నయ్య చిందాల వెంకటేశం, నోముల శ్రీను, శ్యామల బుచ్చయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

భువనగిరి టౌన్, అక్టోబరు 6: భువనగిరిలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు రోజంతా ఆటా పాటలతో సందడి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది ఇంటర్మీడియట్‌లో తీసుకున్న కోర్సులేనని కళాశాల చైర్మన్ పడాల శ్రీనివాస్ అన్నారు. ఇంటర్మీడియట్ విద్య ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. డైరెక్టర్ గడ్డం సోమచందు, ప్రిన్సిపాల్ మదిరె మల్లేశం, లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి పారిశుధ్య సేవలు: కమిషనర్

భువనగిరి టౌన్, అక్టోబరు 6: మునిసిపాలిటీలో పూర్తిస్థాయి పారిశుధ్య సేవలు అందిస్తున్నామని కమిషనర్ పి.రామానుజన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్తీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామని, మురికి కాలువలను నిత్యం శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరిస్తూ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. పారిశుధ్య పనులపై పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం



ట్యూబ్‌లైట్ ధ్వంసమైన దృశ్యం

తుర్కపల్లి, సెప్టెంబరు 6: తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భారీ శబ్దంతో పిడుగు పడడంతో గ్రామస్థులు ఉలిక్కి పడ్డారు. పిడుగుపాటుకు గ్రామంలోని పలు ఇళ్లలో గృహోపకరణాలు దగ్ధం కావడంతో సుమారు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మధ్యాహ్నం సమయంలో తుంపర్లతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో గ్రామానికి చెంది న జాగిల్లపురం సత్యనారాయణ ఇంటి పెరట్లో భారీ శబ్దంతో పిడుగు పడింది. పెరట్లోనే రేకుల షడ్డులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ అయి వాటర్ ప్లాంట్ దెబ్బతిన్నది. కేబుల్ టీవీలకు సంబంధించిన ట్రాన్స్‌మీటర్ కాలిపోయింది. జాగిల్లపురం మల్లయ్య, గుంటి రమేష్, దాసరి గోపాల్ చెందిన ఎల్ఈడీ టీవీలు కాలిపోగా మరి కొందరి ఇళ్లలో ట్యూబ్ లైట్లు, సెట్ ఆఫ్ బాక్స్‌లు, చార్జర్లు, ఇళ్లలో స్విచ్‌లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. మొత్తం రూ.2 లక్షల వరకు నష్టం జరిగి ఉండొచ్చని గ్రామస్థులు తెలిపారు. పిడుగు ఇళ్లలో పడితే ప్రాణ నష్టం జరిగేదని గ్రామస్థులు తెలిపారు.

మహిళా రైతుకు తప్పిన పెను ప్రమాదం

వలిగొండ: ఒక మహిళా రైతు వ్యవసాయ పనులు చేస్తుండగా సమీపంలో పిడుగు పడడంతో పెను ప్రమాదం నుంచి బయటపడింది. బాధితుల వివరాల ప్రకారం... మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు డేగల శోభ, తమ పత్తి చేనులో పత్తి తీయడానికి తమ పొలంలోకి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ మహిళా రైతు వెంటనే సమీపంలోని రేకుల షెడ్డులోకి వెళ్లింది. ఆ సమీపంలో మెరుపులతో కూడిన పిడుగు పడడంతో బావి వద్ద ఉన్న మోటారు స్టార్టర్ పగిలిపోయి సర్వీస్ వైరు పూర్తిగా కాలిపోయింది. కొద్ది సేపటి వరకు మహిళా రైతు తేరుకోలేదు. క్షేమంగా బయటపడిందిని మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు.

సంక్షిప్తంగా..

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన అరుణ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆ మె పదో తరగతి క్లాస్‌మేట్స్ ఆర్థిక సాయం అందించారు. 1990- 91 విద్యా సంవత్సరానికి చెందిన అరుణ సహ విద్యార్థులు రూ. 67వేల రూపాయాలను ఆర్థిక సహకారం అందించారు. తాళ్ల లక్ష్మీరెడ్డి, గడ్డమీది మాధవులు, దీకొండ వెంకటేష్, కీసరి కిషన్, గుండ్లపల్లి నర్సింహ్మగౌడ్, కర్రె మల్లేష్ బబ్బూరి పోశెట్టి ఉన్నారు.

భువనగిరి రూరల్ : ఆపదలో ఉన్న కుటుం బానికి యువత ఆర్థిక చేయూత అందజేసి ఆదర్శంగా నిలిచారు. భువనగిరి మండలం రెడ్డినాయక్ తండాకు చెందిన యువత అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ధరావత్ నర్సింహ (38) గుండె పోటుతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 43వేల నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆలేరు రూరల్ : పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆలేరుకు చెందిన గడసందుల మధుసూదన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆయనను ఆలేరులో మల్లెల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మల్లెల శ్రీకాంత్, ఎగ్గిడి శ్రీశైలం, బత్తిని వెంకటేష్ ఉన్నారు.

అడ్డగూడూరు : మండలంలోని చౌళ్లరామారం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2008-09 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు శ్రావణ్‌కు మార్, నర్సయ్య, రమేష్ ఉన్నారు.

మోత్కూరు : సమాచార హక్కు చట్టం ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి గ్రామానికి చెందిన బీసు బాషను జిల్లా అధ్యక్షునిగా నియమించారు. ఆదివారం ప్రవీణ్‌కుమార్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.

మోత్కూరు : ఎమ్మార్పీ మెస్సెంజర్ల యూనియన్ రాష్ట్ర సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోత్కూరుకు చెందిన కందుకూరి యాదగిరి ఎన్నికయ్యారు.

మోత్కూరు : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పై కొందరు వ్యక్తులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మోత్కూరు సోషల్ మీడియా కోఆర్డినేటర్ బందెల రవి విమర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు.

మోత్కూరు : గ్రూపు-1 నోటిఫికేషన్‌పై కోర్టులో ఉన్న కేసులన్నీ పరిష్కారం అయ్యాకే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఓయూ జేఏసీ నాయకుడు మర్రి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రిలిమ్స్ ప్రశ్నా పత్రంలో దొర్లిన తప్పులు, ప్రిలిమ్స్ అర్హతకు విడుదల చేసిన జీవో 29, పాత నోటిఫికేషన్‌కు కొత్తగా 60 పోస్టులు కలపడం, నోటిఫికేషన్‌లో స్థానికత ఆప్షన్‌ను తొలగించడం లాంటి కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

సంస్థాన్ నారాయణపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి డిమాండ్ చేశారు. సంస్థాన్‌నారాయణ పురం మండలం కొత్తగూడెం గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ 17 వ మహాసభ జరిగింది.

భువనగిరి(కలెక్టరేట్): ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంలో అందజేసిన 100 గొర్రెలు, 13పొట్టేళ్లను అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. వాటిని ఈనెల 8న ఉదయం 10గంటలకు చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు పశు వైద్యశాల ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఆసక్తి కలిగిన రైతులు బహిరంగ వేలంలో పాల్గొనాలని జిల్లా పశువైద్య,పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వి.క్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

యాదగిరిగుట్ట రూరల్: ప్రజలకు ఉచితంగా సేవలు అందించడమే రెడ్‌క్రాస్ సొసైటీ లక్ష్యమని సొసైటీ జిల్లాచైర్మన్ గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలజీ తెలిపారు. మండలంలోని సైదాపురం గ్రామంలో వైద్యులు బలరాం, సల్లా జయశ్రీ ఆధ్వరంలో 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు.

వలిగొండ: మండంలోని గోల్నేపల్లి గ్రామానికి చెందిన జోగు అంజయ్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు.

వలిగొండ: మండలంలోని లోతుకుంట గ్రామ కేజీబీవీలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టుకు తెలంగాణ మోడల్‌స్కూల్లో కేర్‌టేకర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు. స్వీపర్ పోస్టుకు 7వ తరగతి అర్హత కలిగి ఉండి 18-45 వయస్సు మహిళా అభ్యర్థులు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కేర్‌టేకర్ వార్డెన్ పోస్టుకు డిగ్రీ, బిఎడ్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు 8వ తేదిలోపు, ఆసక్తిగలవారు మోడల్ స్కూల్ గర్ల్ హస్టల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కోరారు.

భువనగిరి టౌన్: అనారోగ్యానికి గురైన భువనగిరి ఆర్‌బి నగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త కనుకుర్తి నవీన్‌కుమార్‌కు వైద్య చికిత్స నిమిత్తం దీన్ దయాల్ జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. పార్టీ కార్యకర్తలకు ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉడుత భాస్కర్, ఎన్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

రాజాపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం కోరారు. మండలంలోని బొందుగుల, పారుపల్లి, కుర్రారం, గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

గుంతలతో ఇక్కట్లు



రామన్నపేటలో అమ్మనబోలు రోడ్డు అంచున ఏర్పడిన గుంతలు

రామన్నపేట, అక్టోబరు 6: మండల కేంద్రం నుంచి అమ్మనబోలుకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన మురికి కాల్వల గుంతలు ఉన్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు వెంట వచ్చి పోయే ప్రజలు రాత్రి వేళల్లో గుంతలు కనపడక అందులో పడి గాయాలపా లవుతున్నారు. రామన్నపేట పాత బస్టాండ్, పెద్ద మసీద్ సమీపంలో రోడ్డు పక్కనే గత కొన్ని నెలలుగా గుంతలు పడి మురికి నీరు నిలిచి, దుర్వాసన వెదజల్లుతోంది. అందులో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, దోమలు, అవాసాలు ఏర్పరచుకుంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసి సుర్వి హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 4వ తేదీన తహసీల్దార్‌కు విన్నవించారు.

గోదావరి జలాల రాకపై హర్షం



చెరువులో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 6: గంధమల్ల, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి పెద్దవాగులోకి విడుదల చేసిన గోదావరి జలాలు(సాగునీరు) ఆదివారం మండలంలోని పల్లెపహడ్ గ్రామానికి చేరుకోవడంతో పరివాహక ప్రాంత రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు. గంధమల్ల, తపాస్‌పల్లి రిజర్వాయర్ నీరు రప్పించడానికి భగీథ ప్రయత్నం చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్రపటానికి రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు ఈప్రాంత్రానికి రావల్సిన సాగునీరు నాటి మంత్రి హరీష్‌రావు మళ్లించుకుపోయినా బీఆర్‌ఎస్ నాయకులు నోరు మెదపకుండా రైతులకు మాయ మాటలు చెప్పి తప్పించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కాక ముందే రాష్ట్ర మంత్రులు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుల సహకారంతో గంధమల్ల రిజర్వాయర్ ద్వారా సాగునీరు ఇటీవల పెద్దవాగులోకి విడుదల చేసిన ఘనత ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు దక్కుతుందన్నారు.

బకాయిలు విడుదల చేయాలి: ఏఐఎస్‌ఎఫ్

భువనగిరి టౌన్, అక్టోబర్ 6: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలు విడుదలలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వంతో పలువురు పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపట్టునున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పసుపుల అఖిలాష్, సూరారం కళ్యాణ్, ధనుష్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

ధాన్యం చోరీని నియంత్రించాలి



చోరీకి గురైన ధాన్యం రాశి

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 6: పట్టణ పరిధిలోని ముక్తాపూర్ ఆవాస గ్రామంలోని ధాన్యం కుప్పలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి వడ్లను చోరీ చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన బండారు బాల్‌రెడ్డి, బండారు జంగారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాము పండించిన వరి ధాన్యాన్ని తీసుకుని వచ్చి కుప్పగా పసోశారు. పాలిథిన్ కవర్లను కప్పి ఇంటికి వెళ్లారు. తెల్లారి వచ్చి చూసే సరికి సుమారు 30 వేల రూపాయల వరి ధాన్యాన్ని దొంగలు చోరీ చేశారని ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఢీకొట్టిన ఇసుక లారీ : డ్రైవర్ మృతి

బీబీనగర్, అక్టోబరు 6: మండల కేంద్రంలోని మాధవరెడ్డి విగ్రహం సమీపాన హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఇసుక లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం రెడ్యానాయక్ తండాకు చెందిన ధరావత్ నర్సింహ వృత్తి రీత్యా ఇసుక లారీ డ్రైవర్. కాగా లారీ నెంబర్ టీఎస్ 08యూజీ 4554 నెంబర్ గల లారీ ఈనెల 4వ తేదీ రాత్రి చర్ల ప్రాంతానికి వెళ్లి ఇసుకను లోడ్ చేసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలు దేరారు. కాగా ఆదివారం తెల్లవారు జామున బీబీనగర్ పట్టణంలోని మాధవరెడ్డి విగ్రహం సమీపంలో రోడ్డుకు అడ్డంగా కుక్కలు రావడంతో తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు లారీని ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నర్సింహను స్థానికులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై నర్సింహ భార్య అమ్‌సి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో దేవీ నవరాత్రులు

భువనగిరి టౌన్, అక్టోబరు 6: దేవీ నవరాత్రి ఉత్సవాలను భువనగిరిలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం సామూహిక కుంకుమార్చనలు, పూజలు చేసి అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీరామ్‌తడాక్ భక్తభజన మండలి మండపంలోని అమ్మవారిని గాజుల తండలతో పూజించారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ తదితరులు పూజలు చేశారు.

బీబీనగర్: దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా నెలకొల్పిన దుర్గామాత మండపాల్లో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి దుర్గామాత మండపానికి తాజా మాజీ జడ్పీటీసీ దంపతులు గోళి ప్రణిత పింగల్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మీ శ్రీనివాస్ దంపతులు, మాజీ ఎంపీటీసీ గోళి నరేందర్ రెడ్డి దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు కాసుల రఘునందన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, నర్సింహారెడ్డి, సంతోష్ గుప్తా, దేవరుప్పల శ్రీధర్, నరేందర్, నవీన్‌కుమార్, శివకుమార్, టోని, శ్యాంగౌడ్, జహంగీర్ ఉన్నారు.



బీబీనగర్: అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గామాత

మోత్కూరు : మోత్కూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు ఘనంగా కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు మొగుళ్లపల్లి సోమయ్య, సోమ లింగయ్య, బుస్సా శ్రీనివాస్, సోమ వెంకటేశ్వర్లు, బుక్క విశ్వనాథం, ప్రసాద్ పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: శ్రీచక్రాల ప్రతిష్ఠలతో మానసిక ప్రశాంతతోపాటు ఆధ్యాత్మిక వికాసం పెంపొందుతుందని సిద్ధగురు రమణానంద మహర్షి ఉద్బోధించారు. ఆదివారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం రమణేశ్వరంలో 1018 శ్రీచక్రాలను ప్రతిష్ఠాపనలో భాగంగా 201 శ్రీచక్రాలను భక్తులు దాతల సమక్షంలో వైభవంగా ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా మహా మేరు శ్రీచక్ర ఆలయం, పార్వతీ పరమేశ్వర సన్నిదానాల్లో పంచలోహ దేవతా విగ్రహ మూర్తులకు అధివాసాలు చేశారు.



పోచంపల్లిలో అన్నదానంలో పాల్గొన్న మహిళలు



భువనగిరి అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

వలిగొండ: దేవీ శరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి క్షేత్రంలో దుర్గదేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనం ఇచ్చారు. మహా కాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను అర్చకులు ప్రత్యేకంగా అభిషేకించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని దుర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33వ వార్షిక దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో దుర్గా కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ మురళి, దేవాలయం అధ్యక్షులు డాక్టర్ సీత సత్యనారాయణ, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు బోగ స్వామి, సీత వెంకటేష్, గౌరవ సభ్యులు బోగ చంద్రశేఖర్, సూరపల్లి మధుసూదన్, కొండ శ్రీనివాస్, కమిటీ నాయకులు కేమ నర్సింహ, గుండు ప్రేమ్‌కుమార్, ప్రధానకార్యదర్శి దోర్నాల బావనా బుషి, కోశాధికారి పొట్టబత్తిని సురేష్ పాల్గొన్నారు.